www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

శనివారం | 18 | జనవరి | 2025

పేజీలు 8

# సాగుపై కార్పొరేట్ పడగ



-ఊతమిస్తున్న మోడీ సర్కార్
-కుట్రలో భాగమే నూతన సాగు చట్టాలు
-రైతాంగ ఉద్యమాలతోనే వ్యవసాయ రంగ పరిరక్షణ

మెయిన్‌లో..

## అవినీతికి కేంద్ర బిందువుగా
# వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం




-తప్పుడు రిజిస్ట్రేషన్‌లతో సస్పెండ్‌లు, బదిలీలు
-నిబంధనలకు విరుద్ధంగా దత్తత రిజిస్ట్రేషన్లు
-సమాచారం తెలిసినా పట్టించుకోని జిల్లా రిజిస్ట్రార్

**ప్రజాపక్షం/వైరా :** వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అవినీతికి కేంద్ర బిందువుగా ఉంటూ తప్పుడు రిజిస్ట్రేషన్ ల పర్వాన్ని కొనసాగిస్తున్న కార్యాలయంగా పేరు ఉంది. ఈ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొంతమంది డాక్యుమెంట్ రైటర్లు వారి ఆర్థిక స్వావలంబన కోసం తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించడం డబుల్ రిజిస్ట్రేషన్‌లు చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ రిజిస్ట్రేషన్‌లు కొనసాగుతున్నాయి. ఇప్పటికే వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసిన సబ్ రిజిస్ట్రార్‌లు, ఇన్చార్ తీసుకున్న వారు తప్పుడు రిజిష్ట్రేషన్ లు చేసి కొందరు బదిలీ అయితే మరికొంతమంది సస్పెండ్ అయ్యారు. ఇటీవల కాలంలో సుమారు ఆరు నెలల క్రితం జరిగిన రిజిస్ట్రార్

మిగతా 2లో..

# పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి



-వెలుగుమట్ల పార్కు చుట్టూ ఫెన్సింగ్
-పార్కులో ప్లాస్టిక్‌ను నిషేధించాలి
-వెలుగుమట్ల పార్కును సందర్శించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వెలుగుమట్ల అర్బన్ పార్కును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి ఖమ్మం నగరంలోని 15వ డివిజన్ పరిధిలో గల వెలుగుమట్ల అర్బన్ పార్కును సందర్శించారు. పార్కు అభివృద్ధి ప్రణాళికను మంత్రి పరిశీలించారు. కలెక్టర్, అధికారులతో కలిసి పార్కు మొత్తం తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రాబోయే వర్షాకాలం లోపు వెలుగుమట్ల అర్బన్ పార్కును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్నారు. ఖమ్మం చరిత్ర నేపథ్యంలో ఆకర్షణీయంగా ఉండేవిధంగా వెలుగుమట్ల అర్బన్ పార్కుకు మంచి పేరు పెట్టాలన్నారు. ఖమ్మంతో పాటు కొత్తగూడెం, సత్తుపల్లి ప్రాంతాలలో కూడా అర్బన్ పార్కుల అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. సహజ సిద్ధంగా అటవీ ప్రాంతాలు ఉండటం మన

మిగతా 2లో..

# ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు మహిళా మావోయిస్టులతో సహా 12 మంది మృతి





-తప్పించుకున్న మావోయిస్టు అగ్రనేత హిడ్మా
-మృతదేహాలు, భారీగా ఆయుధాలు స్వాధీనం
-ఛత్తీస్‌గఢ్ బస్తర్ రేంజ్ ఐజి సుందర్ రాజ్

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రతా బలగాలు మావోయిస్టుల నడుమ జరిగిన ఎన్‌కౌంటర్‌లో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత హిడ్మాతో పాటు మరో మావోయిస్టు నాయకుడు బార్సే దేవా కాల్పుల ధాటికి తాళలేక అడవుల్లోనికి జారుకుని తప్పించుకున్నారని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంస బస్తర్ రెంజ్ ఐజి సుందర్ రాజ్.పి తెలిపారు. గురువారం చోటు చేసుకున్న ఎన్ కౌంటర్‌పై ఆయన శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఐజి మాట్లాడుతూ దక్షిణబస్తర్ రేంజ్‌లోని పామేడుబాసగూడఉసర్ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుందన్నారు. మావోయిస్టుల కదలికలు ఉన్నాయనే పక్కా సమాచారం మేరకు సుక్మ,దంతెవాడ, బీజాపూర్, బాసగూడ పిఎస్ పరిధిలోని డిఆర్‌జి, ఎస్‌టిఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్త ఆపరేషన్ నిర్వహిస్తుండగా మావోయిస్టుల బృంధం తారసపడిందన్నారు. గురువారం ఉదయం 9 గం. ప్రారంభమైన ఎన్‌కౌంటర్ చీకటిపడేంత వరకు కొనసాగిందన్నారు. అనంతరం కొందరు మావోయిస్టులు భయంతో అడవుల్లోనికి పారిపోయారని, పారిపోయిన వారిలో అగ్రనేతలు ఉన్నారని చెప్పారు. ఎన్‌కౌంటర్ అనంతరం

మిగతా 2లో..

# యువజనోద్యమాలతోనే సమాజ మార్పు

-నిర్వీర్యమవుతున్న యువశక్తి : బాగం
-ఏఐవైఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ




2 లో

# ఆగని కోడిపుంజుల కొట్లాట

-మూడు రోజుల సరదా సరిపోలే..
-మండలంలో యథేచ్ఛగా కోడిపందాలు



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** సంక్రాంతి పండుగ మూడురోజులు సరదా సరిపోలేదు పందెం రాయుళ్ళకు. యదేచ్ఛగా పట్టపగలే కోడి కాళ్ళకు కత్తులు కట్టి, సై అంటున్నారు మండలంలోని కొందరు పందెం రాయుళ్లు. ఆంధ్రాలో పోగొట్టుకున్న పైసలు సరిపోలేదనుకుంటూ, తగ్గేదేలే అనుకుంటూ తెలంగాణలో ముసుగు పందాల ముసుగులో భారీగానే పందాలు కాస్తున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ అంటూ పండుగ పేరు చెప్పి కోళ్ళను ఆడించిన పందెం రాయుళ్లు, తమకు ఇంకా కుతి తీరలేదన్నట్లు యదేచ్ఛగా కోడిపందాలను

మిగతా 2లో..

## అవినీతికి కేంద్ర బిందువుగా

# వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

(మొదటిపేజీ తరువాయి)

బదిలీలో జిల్లాకు పెద్ద ఎత్తున ఇతర జిల్లాల రిజిస్ట్రార్ లు బదిలీపై వచ్చారు. ఈ రిజిస్ట్రార్ సక్రమంగా ఆఫీసులకు రాకపోగా నాలుగు రోజులుగా విధులు నిర్వహిస్తే నాలుగు రోజులు ఇన్‌చార్జ్‌లు విధులు నిర్వహించడం అనే ఓ కొత్త ఒప్పందాన్ని ఏర్పాటు చేసుకొని రిజిస్ట్రేషన్ పర్వంలో తప్పుడు రిజిస్ట్రేషన్‌లకు తెరలేపారు. జిల్లాలో ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తప్పుడు రిజిస్ట్రేషన్ చేస్తున్నారని స మాచారం అందించినా జిల్లా రిజిస్ట్రార్ స్పందించకపోవడం తప్పుడు రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయని తెలిసినా కూడా వాటిపై చర్యలు తీసుకోకపోవడం ఇప్పుడు ఒక సరికొత్త దందాకు తెరలేపారు అనేది వినపడుతుంది. ఇటీవల కాలంలో బదిలీపై వచ్చిన సత్తుపల్లి రిజిస్ట్రార్ విధులకు డుమ్మకొడుతున్న విషయం తెలిసినా జిల్లా రిజిస్ట్రార్ అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. అదేవిధంగా సత్తుపల్లి రిజిస్ట్రార్ బదిలీపై వచ్చిన తర్వాత రిజిస్ట్రార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉన్న ప్రభుత్వ హాస్పటల్ వెనుక జరిగిన అవినీతి ఒప్పందంలో చేతులు మారుతుండగా పక్కన వాళ్లు చూస్తున్న విషయాన్ని కనిపెట్టి రిజిస్ట్రార్ అక్కడ నుంచి పుగులెత్తాడు. జిల్లాలో రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇటీవల బదిలీలు జరిగిన తర్వాత పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుందని ఆరోఫణలు లేకపోలేదు. వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల కాలంలో దత్తత రిజిస్ట్రేషన్‌లు సైతం నిబంధనలకు విరుద్ధంగా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఎందుకంటే దత్తత రిజిస్ట్రేషన్‌క ప్రభుత్వ నిభంధనల ప్రకారం అన్ని ధృవీకరణ పత్రాలు జతపరచాలి. ఈ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి జిల్లా రిజిస్ట్రార్ సస్పెండ్ అయిన రామచంద్రయ్యను చేయమని చెప్పడం ఒక ప్రాధాన్యత కూడా సంతరించుకుంది. ఎందుకంటే ఏజెన్సీ మండలాల్లో రిజిస్ట్రేషన్ చేయడానికి ఎన్నో నిబంధనలు ఉంటాయి. ఆ నిబంధనలు తో పాటు ఒక దత్తత రిజిస్ట్రేషన్ చేయాలంటే శిశు సంక్షేమ శాఖ నుంచి గాని సంబంధిత శాఖల నుంచిగాని ధృవీకరణ పత్రాలు తీసుకున్న తర్వాతనే దానికి సంబందించి రిజిష్ట్రేషన చేయవలసి ఉంటుంది. కాని అలాంటి రిజిష్ట్రేషన్ నిబంధనలు పట్టించుకోకుండా వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దత్తత రిజిస్ట్రేషన్ జరిగింది. అదేవిధంగా సీనియర్ డాక్యుమెంట్ రైటర్లు తప్పుడు రిజిస్ట్రేషన్‌లలో కీలక పాత్ర వహిస్తున్నారనేది వినిపిస్తుంది. ఎందుకంటే కొందరు డాక్యుమెంట్ రైటర్లు డబుల్ రిజిస్ట్రేషన్‌లలో సంబంధిత డాక్యుమెంట్లు లేకపోయినా వారు రకరకాల నకిలీ సర్టిఫికెట్ లు సృష్టించి రిజిస్ట్రేషన్ పర్వాన్ని కొనసాగించడం కూడా ఇప్పుడు అవినీతికి కేంద్ర బిందువుగా వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మారింది. మెగా సంస్థలు పూర్తిస్థాయిలో వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై నిఘా సంస్థలు ఏర్పాటు చేయడంతో పాటు విచారణ చేపడితే వాస్తవాలు బయటకు వస్తాయి.

# పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

సంపదని కలెక్టర్, డిఎఫ్‌వో మంచి కార్యక్రమాలు తీసుకుంటూ ముందు కెళ్తున్నారని కష్టపడి మనసు పెట్టే అధికారులు ఉన్నప్పుడు వీరికి సహకరిస్తూ అభివృద్ధి పనులు వేగంగా జరిగేలా చూడాలని మంత్రి ప్రజాప్రతినిధులకు సూచించారు. వెలుగుమట్ల అర్బన్ పార్కుకు రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశామని కొంత మంది అనాలోచితంగా తమ భూమి పోతుందని ఆందోళన చెందుతున్నారని ప్రస్తుతం ఉన్న భూమి విలువ కంటే రోడ్డు వేసిన తర్వాత పది రేట్లు పెరుగుతుందని, అభివృద్ధి వేగవంతం అవుతుందని మంత్రి తెలిపారు. వెలుగుమట్ల అర్బన్ పార్కు వద్ద ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని ఇక్కడ క్యాంటీన్‌లో కూడా చిరుధాన్యాలతో తయారు చేసిన పదార్థాలను పెట్టాలని స్వశక్తి మహిళా సంఘాలచే స్టాల్ ఏర్పాటు చేయాలన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్కుకు సంబంధించిన భూమి బౌండరీని గుర్తించి చుట్టూ ఫెన్సింగ్ వేయాలని లోపల రోడ్లు, చెక్‌డ్యాంలో నీరు అందుబాటులో ఉండాలన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్కు అభివృద్ధికి పాత్రికేయులు కూడా సహకరించాలన్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ రాబోయే తరాలను పార్కుకు తీసుకు వచ్చి ప్రకృతిని కాపాడుతూ అభివృద్ధిని సాధించడం ఎలా అనే అంశం తెలియజేసేలా పార్కును అభివృద్ధిని చేస్తున్నామన్నారు. ప్రకృతిని ధ్వంసం చేయడం వల్లే అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని దానిని నివారించేందుకు పార్కు అభివృద్ధి చేపట్టామన్నారు. గత రెండు నెలలుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు అర్బన్ పార్కును సందర్శిస్తున్నారని ఇక్కడి అంశాలు కుటుంబ సభ్యులతో కలిసి పంచుకుంటున్నారని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం నగరానికి కూత వేటు దూరంలో 10 నిమిషాల్లో వెళ్లేలా 500 ఎకరాల పార్కు ఉండడం అదృష్టమన్నారు. ప్రజల ఆరోగ్యానికి ఈ పార్కులు ఉపయోగమని కలెక్టర్ తెలిపారు. ప్రతి రోజు 1000 మంది సందర్శకులు వస్తున్నారని పిల్లలకు అడ్వేంచర్ గేమ్స్, మౌలిక వసతులు కల్పిస్తే భవిష్యత్తులో రోజుకు మూడువేల మంది వారంతంలో ఆరువేల వరకు సందర్శకులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రకృతిని కాపాడుతూ అభివృద్ధి సాధించాలని సందేశం ఉగాది, సంక్రాంతి, బతుకమ్మ వంటి పండుగల ద్వారా మన సంప్రదాయంలో ఎప్పటి నుంచో ఉందని దానిని మనం నిరంతరం పాటించాలన్నారు. జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ 1977లో 546 ఎకరాలకు అర్బన్ పార్కు నోటిఫికేషన్ జరిగిందని అనంతరం భూ పోరాటంలో భాగంగా చాలా వరకు భూమిని కోల్పోయామన్నారు. 2016లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హయాంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని జాయింట్ సర్వే చేసి సుమారు 250 ఎకరాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్దతో మూడు కోట్ల నిధులు మంజూరు చేయించారని ఇక్కడ బోటింగ్, సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ. 1.28 కోట్లు హరితనిధి నుంచి పార్కుకు మంజూరయ్యాయన్నారు. ఇక్కడ జింకల పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో నెలకు రూ.50వేల నుంచి రూ. 60వేల ఆదాయం వస్తుందని ప్రస్తుతం రెండు లక్షలకు పైగా ఆదాయం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, శిక్షణ ఐపిఎస్ రుత్విక్ సాయి, డిఆర్‌డివో సన్యాసయ్య, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, కార్పొరేటర్లు రావూరి కరుణ సైదుబాబు, కమర్తపు మురళి, కొత్తపల్లి నీరజ, మలీదు వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, డిసిసి జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సాధు రమేష్ రెడ్డి, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడండి





**-మాజీ మంత్రి పువ్వాడ అజయ్**

**-బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా కర్నాటి కృష్ణ, ఉప నాయకునిగా మగ్బూల్**

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారం కోసం బిఆర్ఎస్ కార్పొరేటర్లు పోరాటం కొనసాగించాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో బిఆర్ఎస్ కార్పొరేటర్లు ముందు వరుసలో ఉండాలని ఆయన సూచించారు. బిఆర్ఎస్ కార్పొరేటర్ల సమావేశం శుక్రవారం పువ్వాడ అజయ్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎటువంటి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది గడిచినా ఆరు గ్యారెంటీల అమలు చేయడం లేదని ప్రజలను మభ్యపెడుతుందని ఆయన తెలిపారు. అధికారాన్ని అనుభవించడానికే కాంగ్రెస్ నాయకులు ప్రాధాన్యతనిస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్పొరేట్ల సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా కర్నాటి కృష్ణ, ఉప నాయకునిగా మగ్బూల్‌ను ఎన్నుకున్నారు. కార్పోరేషన్‌లో బిఆర్ఎస్ పక్ష నేతగా ఎన్నికైన కర్నాటి కృష్ణ మాట్లాడుతూ కార్పోరేషన్ సమావేశం నిర్వహించక ఆరు నెలలు దాటిందని నగరంలోని సమస్యలను పట్టించుకునే స్థితిలో ఎవరు లేరన్నారు. శానిటేషన్ లేదని నగర శుభ్రత కరువైందన్నారు. మంత్రుల రివ్యూ మీటింగ్‌ల ద్వారా ఎటువంటి అభివృద్ధి జరగలేదని నిధుల కేటాయింపు జరగడం లేదన్నారు. మంత్రుల కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటిచడం లేదని కృష్ణ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, సీనియర్ నాయకులు ఆర్‌జెసి కృష్ణ, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, పెద్ద సంఖ్యలో కార్పొరేటర్లు హాజరయ్యారు.

## ఆగని కోడిపుంజుల కొట్లాట

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహిస్తున్నారు. సత్తుపల్లి మండల పరిధిలోని సిద్దారం, సదాశివుని పాలెం, తాళ్ళమడ, సత్య నారాయణపురం, గంగారం, బాసారం, కొమ్ముగూడెం, చంద్రాయపాలెం తదితర గ్రామాలలో గురు, శుక్రవారాలలో చాటు, మాటుగా కోడిపందాలు నిర్వహించినట్లు సమాచారం. ఓవైపు పోలీస్ వారు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నా పందెం రాయుళ్ళు మాత్రం తగ్గేదేలే అన్నట్లు కోళ్ళకు కత్తులు కట్టి తమ సరదా తీర్చుకుంటున్నారు.

## యువజనోద్యమాలతోనే సమాజ మార్పు

**ప్రజాపక్షం/ఖమ్మం :** యువజనోద్యమాలతోనే సమాజంలో మార్పు వస్తుందని దేశ చరిత్రలో అఖిల భారత యువజన సమాఖ్య చేసిన ఉద్యమాలు అజరామరమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు , ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు తెలిపారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న యువశక్తిని సద్వినియోగం చేసుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని తద్వారా యువశక్తి నిర్వీర్యం అవుతుందని ఆయన అన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్)రూపొందించిన 2025 క్యాలెండర్‌ను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్‌తో కలిసి శుక్రవారం గిరిప్రసాద్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఏఐవైఎఫ్ నిర్వహించిన పాత్ర చిరస్మరణీయమని స్వాతంత్ర్య అనంతరం యువజన హక్కుల కోసం, ఉపాధి కల్పన కోసం చారిత్రాత్మక పోరాటాలు నిర్వహించిందన్నారు. మతోన్మాదం పెచ్చరిల్లుతున్న వేళ సమాజాన్ని పెను ప్రమాదం నుంచి కాపాడాల్సిన బాధ్యత యువతరంపై ఉందన్నారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతుందని ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమని యువశక్తిని వినియోగించుకోలేని ఏ దేశం ముందుకు సాగలేదని ఈ చారిత్రక సత్యాన్ని భారతదేశ పాలకులు మరిచిపోవడం శోచనీయమన్నారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాలని యువజనులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండి గౌస్‌పాషా, నానబాల రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఏఐవైఎఫ్ నాయకులు మద్దోజు శ్రావణ్ కుమార్, మునిగ కోటేశ్వరరావు, ఉసికల రవి, జి. ఉపేందర్, మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, మల్లెబోయిన ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌కౌంటర్లో ఐదుగురు మహిళా మావోయిస్టులతో సహా 12 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

సంఘటనా స్థలంలో పరిశీలించగా, ఐదుగురు మాహిళా మావోయిస్టులతో పాటు 12 మృతదేహాలు లభ్యమయ్యాయని, మృతదేహాలతో పాటు 303 రైఫిల్స్ 2, 12బోర్ తుపాకి 1, 315 బోర్ తుపాకి 1, కొన్ని రాకెట్ లాంఛర్లు, నోస్ మజికల్ లోడింగ్ రైఫిల్, వైర్‌లెస్ కిట్లు, టిఫిన్ బాంబులు, నక్సల్స్ సాహిత్యం, ఇతర వస్తువులు స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. మృతులను గుర్తించే పనిలో ఉన్నామని, త్వరలో మృతుల వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. 2024 నుండి మావోయిస్టుల ఏరివేత పురోగతి కొనసాగుతోందని, 2025 లో 16 రోజుల్లోనే 25 మంది మావోయిస్టులను హతమార్చినట్లు చెప్పారు. అడవుల్లోనికి తప్పించుకుని పారిపోయిన మావోయిస్టుల కోసం వేట కొనసాగుతోందని, ప్రభుత్వ నిర్ధేషానుసారం బలగాలు పెద్ద ఎత్తున గాలింపు చర్యలో నిమగ్నమైన ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేక మావోయిస్టు కార్యకలాపాలకు పాల్పడే వారు జనజీవన స్రవంతిలో కలిసేందుకు ప్రభుత్వం మార్గం సుగుమం చేసిందని, స్వచ్ఛందా వచ్చి పోలీసులు ఎదుట లొంగిపోతే వారికి ప్రభుత్వ పరంగా పునరావాసం కల్పిస్తామని ఐజి సుందర్ రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రాకేష్ అగ్రవాల్, డిప్యుటీ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కమ్లేచన్ కశ్యప్, బీజాపూర్ ఎస్‌పి జితేంధర్ కుమార్, ఎస్‌టిఎఫ్ ఎస్‌పి విజయ్ పాండేతో పాటు తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## రాయలకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** విదేశీ పర్యటన ను ముగించుకుని స్వగ్రామం కు వచ్చిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ను ఘనంగా సన్మానించారు. అమెరిక పర్యటన ను ముగించుకుని శుక్రవారం ఖమ్మం వచ్చిన సందర్భంగా పార్టీ నాయకులు పలువురు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, సేవాదళ్ పాలేరు కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, బీసీ సెల్ ఉపాధ్యాక్షుడు బోయిన వేణు, యూత్ కాంగ్రెస్ పాలేరు డివిజన్ ఉపాధ్యాక్షుడు గట్టికుండ్ల విజయ్, భూక్యా చిన్న నాయక్, సాయి నవీన్, గట్టికుండ్ల వెంకటేశ్వర్లు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లికి ఘనంగా పంచామృతాభిషేకం

**ప్రజాపక్షం / పాల్వంచ టౌన్ :** మండల పరిధి కేపీ, జగన్నాధపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవాస్థానం (పెద్దమ్మగుడి) లో శుక్రవారం అమ్మవారికి పంచామృతాములతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో దేవస్థాన అర్చకులు, భక్తులు జన్మ స్థలం వద్ద ఉన్న అమ్మవారికి పంచామృతాలు, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించి అనంతరం దేవాలయంలోని అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం అనంతరం పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పూజలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, దేవాస్థాన కార్యనిర్వహణాధికారిని ఎన్. రజనీకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పెద్దమ్మతల్లి దేవాలయంలో టెండర్-కం-బహిరంగ వేలం వాయిదా...

శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి)లో శుక్రవారం అమ్మవారికి చెందిన కొత్త కాంప్లెక్స్‌లోని షాపు నెంబర్04, షాపు నెంబర్ 10, రెండు ఏసీ ఫంక్షన్ హాల్స్‌ను మూడు సంవత్సరాల కాల పరిమితికి లీజు / లైసెన్సు హక్కు పొందుటకు, దేవస్థాన తరపున ప్రోగుచేసిన చీరల అమ్మకం, పాత పాంప్లెక్స్‌లోని షాపు నెంబర్ 01 బొమ్మలు, బల్లలు, ఇతర వస్తువుల అమ్మకానికి సీల్డ్ టెండర్‌కంబహిరంగ వేలం దేవస్థాన కార్యనిర్వహణాధికారిని ఎన్. రజనీకుమారి ఆధ్వర్యంలో నిర్వహించుటకు నిర్ణయించగా పాటదారులు ఎవరు రానందున వాయిదా వేసినట్లు ఆలయ ఈవో తెలిపారు.

# ఖమ్మం నగర అభివృద్ధికి చర్యలు



-రూ. 30 కోట్లతో ఖిల్లా రోప్ వే పనులు
-దశల వారీగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం
-అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర అభివృద్ధికి చిత్తశుద్ధితో చర్యలు చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని మూడవ డివిజన్ బల్లేపల్లి జయనగర్ కాలనీలో ఎల్ఆర్ఎస్ నిధులు రూ. 2కోట్లతో చేపట్టనున్న సిసి డ్రైన్ నిర్మాణ పనులకు, రూ. 1.25 కోట్లతో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో దివంగత కార్పొరేటర్ జగన్ మన మధ్యలో లేకపోవడం చాలా బాధాకరమని ఆయన డివిజన్‌లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో ఖానాపురం, బల్లేపల్లి, బాలపేట నుంచి ఖమ్మం నగరంలోకి వచ్చిన వరద నివారణకు రూ. 200 కోట్లతో సర్ ప్లస్ నీరు ధంసలాపురం మీదుగా మళ్లీ మున్నేరుకు వెళ్లేవిధంగా కాలువ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఖమ్మం ఖిల్లా, వెలుగుమట్ల అర్బన్ పార్కు అభివృద్ధికి ప్రణాళికలు చేపట్టామని అర్బన్ పార్కుకు మూడు కోట్లు మంజూరు చేశామన్నారు. ఖమ్మం ఖిల్లా రోప్ వే ద్వారా సందర్శకులు వెళ్లేందుకు, పర్యాటక కేంద్రంగా తయారు చేసేందుకు రూ. 30 కోట్లతో పనులు చేపట్టామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జనవరి 26 నుంచి అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, నూతన రేషన్ కార్డుల జారీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. మొదటి దశలో అత్యంత పేదలకు ప్రభుత్వ సాయం అందుతుందని తర్వాత దశల వారీగా అర్హులందరికీ పథకాలు అందుతాయన్నారు. ఉగాది నుండి రేషన్ కార్డుల క్రింద సన్నబియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ. 500 బోనస్ అందించిందన్నారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ నూతన వైద్య కళాశాల జిల్లాకు రావడంతో పాటు జిల్లా ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యా రంగంలో మన పిల్లలు అద్భుతంగా ఎదగాలనే ఆకాంక్షతో జిల్లాలో 60 ఉన్నత పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులు ప్రవేశపెట్టినట్లు ఆయన తెలిపారు. జిల్లాలో రూ. 575 కోట్లతో 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని రూ. 160 కోట్లు బోనస్ ఇచ్చామని తెలిపారు. భక్తరామదాసు, నాగార్జున సాగర్ ఇతర ఎత్తిపోతల పథకాల క్రింద సాగునీరు సజావుగా అందేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ఆర్అండ్‌బి ఈఈ యుగంధర్‌రావు, కార్పొరేటర్లు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్,స్థానిక నాయకులుపాల్గొన్నారు.



# మంత్రి తుమ్మలకు మార్కెట్ కమిటీ కృతజ్ఞతలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఫైరింజన్ కేటాయించడంతో పాటు మార్కెట్ అభివృద్ధికి రూ. 155 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఖమ్మం వ్యవసాయ వ్యవసాయ మార్కెట్ నూతన పాలక మండలి శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 16న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పత్తి మార్కెట్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటన స్థలాన్ని సందర్శించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్‌కు ఫైరింజన్ అవసరం ఉందని గుర్తించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటనే సంబంధిత శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంత్రి ఆదేశానుసారం సాయంత్రం నాటికి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు ఫైరింజన్‌ను మంజూరు చేసి మార్కెట్‌కు పంపించారు. అదేవిధంగా ఖమ్మం మార్కెట్ అభివృద్ధి కొరకు రూ. 155 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఈ సందర్బంగా మార్కెట్ కమిటీ నూతన పాలక మండలి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ ఛైర్మన్ తల్లాడ రమేష్‌తో పాటు పలువురు డైరెక్టర్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# సంజయ్ కుటుంబానికి కాంగ్రెస్ నేతల పరామర్శ



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** అనుమానస్పద స్థితిలో మృతి చెందిన పందెపు సంజయ్ కుటుంబాన్ని మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన బైరు హరినాథ్‌బాబు, మండల కాంగ్రెస్ నాయకులు ఖమ్మంరూరల్ మండలం పోలెపల్లి పంచాయతీ పరిధిలోని రాజీవ్‌గృహకల్పలో గల నివాసం వద్దకు వెళ్లి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.10వేలను మృతుడి తండ్రికి అందజేసి ఓదార్చారు. అధైర్య పడవద్దని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సౌజన్యంతో అండగా నిలుస్తామని మనోధైర్యాన్ని ఆ కుటుంబానికి కల్పించారు. అలాగే మృతిపై సమగ్ర విచారణ జరిపించి నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీస్ వారికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, భూక్య సురేష్ నాయక్, మండల కాంగ్రెస్ నాయకులు బానోత్ హరి నాయక్, శేశిరెడ్డి, నగేష్, గోరేమియా, శ్రీను, చంద్రశేఖర్, మహేష్, రవి, నరేష్, గణేష్, సత్తార్, పాలేరునియోజకవర్గ యువజనం కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ కిరణ్, యువనాయకుడు ఏనుగు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పార్కు అభివృద్ధి పనుల గ్రౌండింగ్‌కు చర్యలు

-కుటుంబానికంతటికి ఆహ్లాదం కలిగించాలి
-పర్యావరణహిత పార్కుగా రూపకల్పన
-వెలుగుమట్ల పార్కు అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వెలుగుమట్ల అర్బన్ పార్కు అభివృద్ధి పనులు ఫిబ్రవరి నెలాఖారుకు గ్రౌండింగ్ అయ్యేలా అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం అటవీ శాఖ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి వెలుగుమట్ల అర్బన్ పార్కు అభివృద్ధి పనుల కార్యాచరణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ వైరా హైవే రోడ్డు నుంచి వెలుగుమట్ల అర్బన్ పార్కుకు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత భూ యజమానులతో సంధి చర్చలు జరిపి భూ సేకరణ పూర్తి చేయాలన్నారు. రోడ్డు నిర్మాణంతో భూ ధరలు పెరిగి యజమానులు లాభపడతారన్నారు. అర్బన్ పార్కుకు వెనక భాగం ఫెన్సింగ్ చేపట్టాలన్నారు. సరిహద్దు వివాదాల వద్ద జాయింట్ సర్వే చేపట్టి సమస్య పరిష్కరించాలన్నారు. హైవే రోడ్డుపై అర్బన్ పార్కుకు వెళ్లే చోట ఆకర్షణీయమైన అర్చీ ఏర్పాటు చేసి బస్టాండ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. పార్కుకు మినీ బస్సులు నడిపేలా కార్యాచరణ చేయాలన్నారు. అర్బన్ పార్కు వద్ద పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, బయట తినుబండారాలకు అనుమతి ఇవ్వవద్దని, క్యాంటీన్‌ను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలన్నారు. బయో వస్తువులు మాత్రమే వాడేలా చూడాలన్నారు. నామ సూచికలు ఆకర్షణీయంగా ప్రదర్శించాలన్నారు. వాకింగ్ ట్రాక్ ఆధునీకరించాలని పిల్లలకు ప్లేజోన్, యువతకు అడ్వేంచర్ పార్కు, యోగా వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. పార్కు చుట్టూ పెట్రోలింగ్ చేపట్టాలని భద్రతకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ఎఫ్‌డివో మంజుల, జిల్లా పర్యాటక అధికారి సుమన్ చక్రవర్తి, పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్, ఇరిగేషన్ ఈఈ రామకృష్ణ, డిఈ రాంప్రసాద్, ఎఫ్ఆర్వో నాగేశ్వరరావు, అర్బన్ తహసీల్దార్ రవికుమార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/ మధిర :** జాతీయస్థాయిలో జవహర్ నవోదయ విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం మధిర టివిఎం ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించే ప్రవేశపరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఇఓ వై.ప్రభాకర్ తెలిపారు. మధిర టివిఎం సెంటర్‌లో ఇంగ్లీష్ మీడియం నందు 139, తెలుగు మీడియం నందు 16 మొత్తం 155మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. ఉదయం 11.30గంటల నుండి 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించటం జరుగుతుందని, పరీక్షా కేంద్రానికి విద్యార్థులు అడ్మిట్ కార్డుతో పాటు ఆధార్ తీసుకుని సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

# నిరుపేద విద్యార్థికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మధిర మండలంలోని మహాదేవపురం గ్రామానికి చెందిన నందిని ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సర కాలేజి ఫీజు కట్టడానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు చేడే శ్రీనివాస్ తన మిత్రుడు సహకారంతో రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని విద్యార్థినికి అందచేశారు. ఈ సందర్భంగా కుమారి నంది ని, విద్యార్థిని తల్లిదండ్రులు దాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు కోట జయరాజు, చేడే సునిత పాల్గొన్నారు.

# సిసి రోడ్డుకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ చింతకాని :** పల్లెలన్నీ సీసీ రోడ్లతో సుందరీకరణ చేయడమే భట్టి విక్రమార్క లక్ష్యమని నేరడ గ్రామ ఉపసర్పంచ్ దూసరి గోపాలరావు పేర్కొన్నారు.శుక్రవారం మండలపరిధిలోని నేరడ గ్రామంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సిఫారసు మేరకు మంజూరైన సీసీ రోడ్లకు గోపాలరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా గోపాలరావు మాట్లాడుతూ రాబోయే నాలుగేండ్లలో గ్రామసీమలన్ని అభివృద్ధిచెందుతాయన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు షేక్ దస్తగిరి, మట్టా రవి, పుల్లయ్య, కోటయ్య, సాయి, నాగుల్‌మీరా, మేడ శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధత గల కమ్యూనిస్టు మధుసూదన్



**ప్రజాపక్షం/చింతకాని :** ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ కార్యకర్త మోతారపు మధుసూధన్ నిబద్దత గల కమ్యునిస్టు అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మధుసూధన్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ప్రొద్దుటూరులో జరిగిన కార్యక్రమంలో జమ్ముల పాల్గొని మధుసూధన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ ప్రాంతంలో రైతాంగ సమస్యలపై ఎప్పుడూ మధుసూధన్ పోరాడేవాడన్నారు. మధుసూధన్ మృతి రైతాంగ పోరాటాలకు తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వేపూరి రవీంద్రబాబు,పార్టీ మండల కార్యదర్శి పావులూరి మల్లిఖార్జునరావు,శాఖ కార్యదర్శి తాళ్లపల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మధిర నియోజకవర్గంలో ఇసుక కొరత లేదు

**ప్రజాపక్షం/చింతకాని :** మధిర నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ పథకాలు,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు ఎలాంటి ఇసుక కొరత లేదని ఖమ్మం ఆర్డీవో గుడ్ల నర్సింహారావు శుక్రవారం ఒక్క ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో 14 ఇసుక రిచ్‌లు అందుబాటులో ఉన్నాయని ఎర్రుపాలెం మండలంలో తక్కెళ్లపాడు, సకినవీడు, రాజులదేవరపాడు, మీనవోలు, బోనకల్ మండలంలో కలకోట, బ్రాహ్మణపల్లి, రాయన్నపేట, మోటమర్రి, చింతకాని మండలంలో చిన్నమండవ, తిమ్మినేనిపాలెం, ముదిగొండ మండలంలో పెద్దమండవ, గంధసిరి, మధిర మండలంలో చిలుకూరు, బుచ్చిరెడ్డిపాలెం గ్రామల్లో ని రిచ్‌లలో ఇసుక అందుబాటులో ఉందన్నారు. ప్రతి లబ్దిదారుడు 3 క్యూబిక్ మీటర్లకి రూ.1500/ తహసీల్దార్ పేరున డీడీ సమర్పించి కూపన్లు పొందాలన్నారు. ప్రభుత్వ కాంట్రాక్ట్ పనులకి సంబంధించి డీడీతో పాటు వర్క్ ఆర్డర్ కూడా సమర్పించాలన్నారు. హమాలీ ఖర్చులు దరఖాస్తుదారులే భరించాలన్నారు.

## అశ్వారావుపేట మండల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

### అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే జారె



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట మండల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు.అశ్వారావుపేట మండలంలో శుక్రవారం విస్తృతంగా పర్యటించిన ఆయన రూ.74.5లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ముందుగా కొత్తకావడిగుండ్లలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ గ్రామీణ ప్రాంతాల యువత మత్తు పదార్థాలు, మద్య పానం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. క్రీడల్లో, చదువుల్లో యువత రాణించి తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం అనంతరాంలో రూ.5లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులకు, కోయరంగాపురంలో రూ.10లక్షలతో బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం వేదాంతపురం, కేశప్పగూడెం, గుర్రాలచెర్వు గ్రామాల్లో రూ.60లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల అధికారులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ పోరాటం ఫలితమే బోరు ఏర్పాటు



**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** సిపిఐ పోరాటం ఫలితమే సయ్యద్ మియాజానీ కాలనీ(మెరుపు కాలనీ)లో మంచి బోరు ఏర్పాటు చేయటం జరిగిందని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం అన్నారు. శుక్రవారం బోరు ఏర్పాటు పనులను సిపిఐ శ్రేణులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడతూ ఎన్నో ఏళ్లుగా మియాజానీకాలనీ ప్రజలు మంచినీటి బోరు లేక మంచినీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిపిఐ పార్టీ పోరాటం వలననే మిషన్ భగీరథ ద్వారా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి బోరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న నీటి ఇబ్బందులు తొలగిపోతాయని సయ్యద్ మియాజానీ కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. బోరు ఏర్పాటుకు కృషి చేసిన సిపిఐ పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గన్నిన రామకృష్ణ, ఎఐటీయూసి నాయకులు పఠాన్‌జలాల్, చీపుర్లు సత్యవతి, జోగిరాజు, కాలనీ వాసలు తదితరులు పాల్గొన్నారు.

## జూదం, కోడిపందాలు అరికట్టడంలో సఫలం



**ప్రజాపక్షం/దమ్మపేట:** మండలంలో సంక్రాంతి పండగ వచ్చింది అంటే చాలు జూదం, కోడిపందాలు జరుగుతూ ఉంటాయి. కానీ అది ఒకప్పటి మాట. ఇప్పుడు జుదం పందెం రాయుళ్లు అంతా సర్దుకొని ఎక్కడవారి అక్కడే ఉండిపోయారు. మరికొంత మంది రాష్ట్ర సరిహద్దులు దాటి వెళ్ళిపోయారు. ఈ అంతటికి కారణం దమ్మపేట మండల పోలీస్ ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి. గతంలో పండగ వచ్చిందంటే చాలు జూదం పందెం రాయుళ్లు ఇల్లు, పొలాలు, బంగారం తాకట్టు పెట్టి డబ్బులు సిద్ధం చేసుకుని మండలంలో ఏ మూల పందాలు జరుగుతాయా అని పందాల కోసం ఎదురుచూస్తూ ఉండేవారు కానీ ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి దమ్మపేట కి వచ్చిన తర్వాత అందుకు భిన్నంగా గతంలో జూదం కోడిపందాలలో దోషులుగా ఉన్న వారిని పండగకి ముందు స్టేషన్ కు పిలిసి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎస్సై సాయి కిషోర్ రెడ్డి చేసిన ఈ పనికి ఎంతోమంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రణీత్‌ను సన్మానించిన ములకలపల్లి ప్రెస్ క్లబ్



**ప్రజాపక్షం/ములకలపల్లి:** సైన్స్ స్పేర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించి నేషనల్ పోటీలు సెలెక్ట్ అయిన ఇనుకుర్తి ప్రవీణ్‌ను ములకలపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు క్రాంతి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సౌత్ ఇండియా స్థాయి పోటీల్లో కూడా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో నవోదయ ఆరో తరగతి నందు ప్రవేశ పరీక్ష నేడు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఎదు సింహారాజు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మొత్తం విద్యార్థులు 171 మంది పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 11.30గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులు ఉదయం 10గంటల వరకు పరీక్షా కేంద్రంకు చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రంలో 8 మంది ఇన్విజిలేటర్లు, చీప్ సూపర్డెంట్‌గా ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రవిలా దేవి తాను పర్యవేక్షకులుగా వ్యవహరిచనున్నట్లు తెలిపారు.

# మణుగూరు ఓసీ విస్తరణ సాధ్యమేనా..?

-గ్రామ సభ నిర్వహించి ఏడాది కావోస్తున్నా పూర్తి కాని సర్వే
-పని కల్పిస్తేనే పరిహారం
-పనులు ముందుకు సాగని వైనం





**ప్రజాపక్షం/మణుగూరు:** బొగ్గు గనులతో ఘనమైన చరిత్ర కలిగిన మణుగూరు ఏరియా ఉత్పత్తి లోను సింగరేణి కే తలమానికంగా నిలుస్తుంది. సింగరేణికి అత్యంత లాభాలను అందించడంలో ఇక్కడి ఓసీ 2, ఓసి 4 గనులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ రెండు గనుల నుండి ఏడాదికి 104.50 బొగ్గు ఉత్పత్తి జరుగుతుంది. 2016లో ఏర్పడిన మణుగూరు ఓసీ గని జీవిత కాలం పదేళ్లు. ప్రస్తుతం ఏడాదికి 21 లక్షల టన్నుల బొగ్గుని వెలికి తీస్తున్నారు. గని జీవితకాలం మరో మూడేళ్లే ఉండటంతో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా గనిని విస్తరించాల్సి వస్తోంది. గని విస్తరణకు కావాల్సిన భూమిని సేకరించే క్రమంలో నిర్వాసితులు తమకు ఉద్యోగం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించాలని కోరుతున్నారు. ఈ రెండు డిమాండ్ల పై ప్రభుత్వం నుంచి స్పందన లేదు. జిల్లా ఉన్నతాధికారులు రెండు పర్యాయాలు సింగరేణి అధికారులతో సమావేశం నిర్వహించారు. నిర్వాసితుల డిమాండ్లను నెరవేర్చని పక్షంలో భూసేకరణ ప్రక్రియ సజావుగా సాగే అవకాశమే లేదు. గని విస్తరణతో 450 మంది నిర్వాసితులుగా మారనున్నారు. వీరందరూ వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నావారు. తమకు సింగరేణి సంస్థ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. ఓసీ విస్తరణ పనులు ప్రస్తుతం అనుమతుల దశలలో ఉన్నాయి. దీనిపై పూర్తిస్థాయిలో అధికారుల నుండి స్పష్టత రావాల్సి ఉంది. ఓసీ విస్తరణ జరిగితేనే ఏరియాలో సింగరేణి ఉనికి ఉంటుంది. లేదంటే గత ఉనికిని కోల్పోవాల్సి వస్తుంది. కానీ సింగరేణి అధికారులు మాత్రం ప్రజలు సహకరిస్తేనే ఓసీ విస్తరణ పనులు ముందుకు సాగుతాయని తెలపడం గమనార్హం. మరోవైపు ఓసి విస్తరణతో ప్రత్యక్షంగా, పరోక్షంగా లభించన్ను ఉపాధి కోసం కార్మిక, కార్మికేతర కుటుంబాలు ఎదురు చూస్తున్నాయి.

**మణుగూరు ఓసి విస్తరణ సాధ్యమేనా..?**

గని విస్తరణకు ఎంత భూమి కావాలో సింగరేణి అధికారులు అంచనా వేసి ప్రణాళికలను సిద్ధం చేసారు. మణుగూరు ఓసీ గని విస్తరణకు రామానుజవరం, తిర్లాపురం రెవెన్యూ గ్రామాల్లో 818 ఎకరాలను ప్రభుత్వం సేకరించనుంది. గత మార్చి నెలలో రెండు పర్యాయాలు గ్రామసభలు జరగ్గా భూసేకరణను నిర్వాసితులను ఒప్పించలేకపోయారు. మళ్లీ గ్రామసభల నిర్వహణకు ప్రభుత్వం సింగరేణి అధికారులు చేపట్టలేదు. నిర్వాసితుల డిమాండ్ల పైనా స్పందించటం లేదు. మరోవైపు మణుగూరు ఓపెన్ కాస్ట్ గని విస్తరణ కోసం సింగరేణి అధికారులు గత కొన్నాళ్ళుగా చేపట్టిన భూ సేకరణ ప్రయత్నాలకు ముందడుగు పడటం లేదు. ఇప్పట్లో ఓసి విస్తరణ సాధ్యమేనా అనే అభిప్రాయం అటు కార్మికుల లోను, ఇటు ప్రజల్లోనూ వినిపిస్తున్నాయి.

**ఏడాది కావోస్తున్నా పూర్తికాని సర్వే..**

మణుగూరు ఓసీ గని జీవితకాలం గడువు మరో ఏడాదిన్నర మాత్రమే ఉంది. అప్పటిలోగా గని విస్తరణకు కావాల్సిన భూమిని సేకరించే పనులు పూర్తిచేయాలి. ఈ నేపథ్యంలో మరో 15 ఏళ్ల వరకు బొగ్గును ఉత్పత్తి చేసేలా మణుగూరు ఓసీ గనిని విస్తరించేందుకు సింగరేణి ప్రయత్నాలు చేపట్టింది. భూ సేకరణ కోసం గ్రామ సభలు నిర్వహించి ఏడాది గడుస్తున్నా భూ సేకరణలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. దీంతో విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు. ఓసి భూసేకరణలో జరుగుతున్న జాప్యంతో భవిష్యత్తులో ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యంపై తీవ్ర ప్రభావం పడనుంది.

# సింగరేణి దుమ్ముతో 38 ఏళ్లకే నూరేళ్లు నిండాయి..

-నా చావుకు కారణం సింగరేణి నిర్మించిన సైలో బంకర్
-సెల్ఫీ వీడియోలో వాపోయిన మృతుడు రవీంద్ర



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** 38 ఏళ్ళకే బుర్ర తుకారం అలియాస్ రవీంద్రకు నిండు నూరేళ్ళ జీవితాన్ని ప్రసాదించింది సింగరేణి. ఎంతో బంగారు భవిష్యత్తు ఉన్న ఓ యువకుడు 38 ఏండ్లకే తనువు చాలించడం సమాజాన్ని ప్రశ్నిస్తుంది. అభివృద్ధి చేస్తామంటూ అడుగుపెట్టిన సింగరేణి అభివృద్ధి మాటలు పక్కనపెట్టి ఆయువులు తీస్తుంది. వివరాల్లోకెళితే.. మండల పరిధిలోని అంబేద్కర్ నగర్ కాలనీలో నివసిస్తున్న బుర్ర తుకారం రవీంద్ర (38) గుండె, లివర్, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ తో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచాడు. మృతుడు తుకారాం అలియాస్ రవీంద్ర మెరుగైన వైద్యం కోసం రాష్ట్ర రాజధానిలోని గాంధీ హాస్పిటల్ లో చేరడానికి ముందు తీసుకున్న సెల్ఫీ వీడియో ఇప్పుడు ప్రతి ఒక్కరిని ఆలోచింప చేయడమే కాకుండా, మనసున్న ప్రతి ఒక్కరిని ప్రశ్నించమని కోరుతుంది. తన చావుకు పూర్తి బాధ్యత తమ కాలనీ ముందు సింగరేణి వారు నిర్మించిన సైలో బంకర్ నుండి వెలువడే దుమారమేనని, ఆ సైలో బంకర్ ను అక్కడ నుంచి తొలగించి తమ కాలనీవాసులకు అధికారులు న్యాయం చేయాలని వేడుకోవడం ప్రతి ఒక్కరి మనసులను కలచి వేస్తుంది. మా కాలనీని మమ్ములను ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రాణాలు కోల్పోకుండా కాపాడాలంటూ మాట్లాడిన మాటలు వింటున్న కాలనీవాసులు కంటతడి పెడుతున్నారు. మృతుడు తుకారాంకు అంగవైకల్యం కలిగిన భార్య, ఇద్దరు చిన్న పిల్లలున్నారు. చిన్న వయసు లోనే తండ్రిని దూరం చేసుకున్న చిన్నారులు, బంగారు భవిష్యత్తు ఉన్న భర్త అర్ధాంతరంగా తనువు చాలించడంతో దివ్యాంగురాలైన భార్య పరిస్థితి ఏమిటనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. అంబేద్కర్ నగర్ కాలనీలో వందల మరణాలు సైలో బంకర్ వల్లన కలుగుతున్నా సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పేదల ప్రాణాలు పిట్టల్లా రాలుతున్నా అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం, అభివృద్ధి పేరుతో అడుగుపెట్టి కోట్లు కూడా పెట్టుకుంటున్న సింగరేణి, మృతి చెందిన కుటుంబాలకు కనీసం నష్టపరిహారం కూడా చెల్లించకపోవడం వారి యొక్క గర్వానికి నిదర్శనంగా కనిపిస్తుంది. నల్ల బంగారం తీస్తామంటూ వచ్చిన సింగరేణి తమ కుటుంబాల్లో బంగారాలను దూరం చేస్తుందని కాలనీవాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు అంబేద్కర్ కాలనీవాసులకు పునరావాసం కల్పించి చనిపోయిన మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించి అన్యాయం చేయాలని లేని పక్షంలో సింగరేణి యాజమాన్యానికి ప్రతిఘటన తప్పదని హెచ్చరిస్తున్నారు.

## ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన జెపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజుని జెపిఆర్ ట్రస్ట్ అధ్యక్షులు ఇడుపుల రాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి నూతన సంవత్సర మరియు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ చిన్న వయసులోనే జెపిఆర్ఎస్ ట్రస్ట్ ని స్థాపించి వివిధ సేవకార్యక్రమాలు చేస్తూ, నిరుపేదల ఆదరణ పొందుతున్న ఇడుపుల రాజును అభినందించారు. ఇక ముందు కూడా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పలు సూచనలు చేశారు . ఈ కార్యక్రమంలో భూక్యా అజయ్ రాథోడ్ తదితరులున్నారు.




# పథకాలపై రాజకీయ జోక్యం..?




- నాలుగు పథకాలపై సర్వత్ర చర్చ
- మొదలైన అధికారుల సర్వే
- 21 నుండి 24 వరకు గ్రామసభలు
- 26న మంజూరీ పత్రాలు అందజేత
- కాంగ్రెస్ నాయకులకు మరో సారి పెరిగిన గిరాకీ
- భద్రాచలంలో రెండు వర్గాలు

**ప్రజాపక్షం/భద్రాచలం :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26 నుండి అమలు చేయ తలపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల మంజూరీ పథకాలపై రాజకీయ జోక్యం ఉండేనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పైరవీలకు పెట్టింది పేరు అనే వాదన ఇప్పుడు మరో సారి బలంగా వినవస్తోంది. ఇప్పటికే పథకాల అమలుపై లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారుల బృంధాలు జిల్లా వ్యాప్తంగా సర్వే మొదలు పెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత ప్రజాపాలన పేరుతో ప్రజల నుండి ఆయా పథకాల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తులు స్వీకరించారు. మరో ప్రక్క నిర్వహించిన సామాజిక ఆర్థిక, రాజకీయ, విద్యా,ఉపాధి, కుల సర్వే ఆధారంగా ప్రతీ ఇంటి పరిస్థితిని నమోదు చేశారు. ఇప్పటికే ప్రభుత్వం పలు పథకాలు అమలువుతున్నాయి.ఈ నెల 26 నుండి రైతు భరోసా, ఇందిరమ్మఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు వంటివి అర్హులైన వారికి అందించేందుకు సమాయత్తమవుతోంది. సాధారణంగా కాంగ్రెస్ ప్రభుత్వం పైరవీలు పెద్ద ఎత్తున నడుస్తాయని వాదన ఉంది. ఇందుకు చెప్పుకుంటూ పోతే చాలా ఉదాహరణలే ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కాంగ్రెస్ పాలనలో ఇందిరమ్మ ఇళ్ల వ్యవాహారం పెద్ద తలనొప్పిగా మారింది. విధులు నిర్వహించే సిబ్బంది ఇబ్బడి ముబ్బడిగా ఇళ్లను మంజూరు చేస్తూ అందిన కాడికి దోచుకున్నారు. పైసలిచ్చే వారికే ఇంటిని మంజూరు చేసి నిజమైన పేద లబ్ధిదారులకు మొండి చెయ్యి చూపారు. కొన్ని బిల్లులు కాకపోవడంతో ఇళ్లు మొండిగోడలుగా దర్శనమిస్తున్నాయి. బిల్లులు చేసేక్రమంలో కూడా పర్సంటేజీలు ముట్ట చెప్పాల్సి వచ్చింది. పోడు భూముల వ్యవాహారంలో కూడా రాజకీయ జోక్యం పెద్ద ఎత్తున సాగింది. కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ తర్వాతి బిఆర్ఎస్ ప్రభుత్వంలో అర్హత లేనివారుకూడా పోడు పట్టాలు పొందారనే వాదనలు వినవచ్చాయి. అందమైన భవంతుల్లో నివసించే వారికి కూడా ప్రస్తుతం రేషన్ కార్డులు ఉన్నాయి. ఇవన్నీ రాజకీయ పైరవీల వల్లే జరిగాయని ప్రజల వాదన. మరో ప్రక్క గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అందించిన దళితబంధు పథకం తీవ్ర విమర్శలను మూటగట్టుకుంది. ఇక రైతు భరోసా పథకం అమలులో గత ప్రభుత్వం అక్రమాలకు పాల్పడినట్లు తేల్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన అర్హులను గుర్తించి వారికి మాత్రమే పథకం అమలు చేస్తామని ప్రకటించింది. ఈ క్రమంలో పట్టాలు ఉన్న పొలాలు చాలా వరకు ఇప్పుడు జిల్లాలో రియల్ ఎస్టేట్ వెంచర్లుగా వెలిశాయి. జిల్లాలో 1,84,014 మంది రైతులకు గానూ 5,09,966.82 ఎకరాల భూమి ఉంది. ఇప్పుడు దీంట్లో సుమారు 20 శాతానికిపైగా రియల్ రంగంలోనికి వెళ్లిపోయింది. ఈ పథకం ద్వారా ఏటా ఎకరాకు రూ.12 వేలు అందిస్తారు. మరో ప్రక్క వ్యవసాయ భూములు లేని వ్యవసాయ కూలీలకు ఎటా రూ.12 వేలు ఇవ్వనున్నారు. ఉపాధిహామీ జాబ్ కార్డు ఉండి ఏడాదిలో కనీసం 20 రోజుల పనిదినాలు వినియోగించుకున్న వారికే ఇందిరమ్మ ఆత్మీయభరోసా వర్తించనుంది. జిల్లాలో 2,19,006 జాబ్ కార్డులు ఉండగా, 1,35,946 మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారు. వీరిలో అర్హులను గుర్తించాల్సి ఉంది, ఇక రేషన్ కార్డుల కోసం ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నారు. సర్వే ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో 2,73,493 దరఖాస్తులు అందగా వాటిపై లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ 95 శాతం జరిగింది.

**సర్వత్రాచర్చ ...**

ప్రభుత్వం అమలు చేయబోతున్న నాలుగు పథకాలపై సర్వత్ర చర్చసాగుతోంది. అర్హులకు మాత్రమే పథకాలు అందించాలని మంత్రులు బాహాటంగానే ప్రకటించినప్పటికీ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఎంఎల్ఏలు లబ్ధిదారులను ఎంపిక చేసే అవకాశం ఉందనే వాదన ఉంది. ఇప్పటికే తొలిజాబితాలో మీ పేరు ఉండేలా చేస్తామంటూ ఎంఎల్ఏల అనుచరులు, పైరవీకారులు హామీల ఇస్తున్నట్లు తెలుస్తోంది. సర్వేచేసే అధికారులు సైతం స్థానిక ఎంఎల్ఏను కాదని పెన్ను కదిపే పరిస్థితి ఉండదు. ఎవరు ఏ సర్వే చేసినా ఆఖరికి ఎంఎల్ఏ టిక్కు పెట్టిన వారి పేర్లే తొలిజాబితాలో ఉంటాయని, తాము పేదలమంటూ నెత్తీ నోరు బాదుకున్నా ఉపయోగం జరగదని, ఇలా ఎన్నో సార్లు మోసపోయామని పేదల వాదనలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. మరో ప్రక్క కమిటీల భాగస్వామ్యంతో అమలు కానున్న నాలుగు పథకాల వ్యవహారం అధికారులకు అగ్ని పరీక్షగా మారనుంది. 20వ తేది వరకు సర్వేలు పూర్తి చేసి 21 నుండి 24 వరకు గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. 26న పూర్తి ముసాయిదా జాబితాను అందించి లబ్ధిదారులకు అర్హుక పత్రాలు ముట్టచెబుతారు.

**ఇక్కడ రెండు వర్గాలు...**

భద్రాచలంలో కాంగ్రెస్ పార్టీలో అధికారికంగా రెండు వర్గాలు ఉన్నాయి. మాజీ ఎంఎల్ఏ, ప్రస్తుత అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య వర్గం ఒకటి కాగా, మరొకటి ఎంఎల్ఏ డా. తెల్లం వెంకట్రావు వర్గం. ఈ రెండు వర్గాలకు చెరొక పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఉన్నారు. ఇది ప్రజలకు, అటు అధికారులకు తలనొప్పిగా మారింది. పథకాల అమలులో రాజకీయ జోక్యం ఉండే అవకాశం ఉంటుందనే వాదన వినిపిస్తుండటంతో ప్రజలు ఎవరి ప్రసన్నత కోసం పాకులాడాలో అర్థంకాని పరిస్థితుల్లో ఉన్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## రామానుజవరం క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానం



క్రీడాస్ఫూర్తి గురించి బొల్లోజు అయోధ్య ప్రేరణాత్మక ఉపన్యాసం

**ప్రజాపక్షం/మణుగూరు:** రామానుజవరం గ్రామ పంచాయతీ స్థాయిలో బాడీష సతీష్ ఆధ్వర్యంలో భగత్ సింగ్ క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి (5,000/) గడ్డం నవీన్ రామాలయం టీమ్, రెండవ బహుమతి (3,000/) పావురాల సాంబా పిఎస్ఎస్ టీమ్, బెస్ట్ బౌలర్ షీల్డ్ నడికొప్పుల సిద్దు, బెస్ట్ బ్యాట్స్ మాన్ షీల్డ్ కోలేటి శివ, బెస్ట్ సిక్సర్ 500/రూ బహుమతి గడ్డం నవీన్ స్టేజ్ మీద సిక్స్ కొట్టిన 500/రూ బహుమతి పావురాల. సాంబలు బహుమతులు గెలుచుకున్నారు. అతిథులు మరియు నిర్వాహకులుగా బొల్లోజు అయోధ్య (సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు), యాదారి రమేష్ (మాజీ ఎంపిపి), కమిశెట్టి రామారావు (మాజీ ఎంపిటిసి), టోర్నమెంట్ నిర్వాహకులుగా దేశాబోయిన వినోద్ , దేశాబోయిన సహదేవ, నోముల రవిలు వ్యవహరించగా క్రీడాకారులకు భోజన సదుపాయాలను లేళ్ళ కృష్ణ, అక్కి నరసింహారావు, భగత్ సింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బొల్లోజు అయోధ్య మాట్లాడుతూ బాడీష సతీష్ ఆధ్వర్యంలో ఇలాంటి క్రీడా కార్యక్రమాలు గ్రామ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో ఎంతో సహాయపడతాయని అన్నారు. గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించాలన్నారు. గెలుపు ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుందని, ఓటమి అనుభవాలను నేర్పుతుందని వివరించారు. క్రీడలు మానసిక బలాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో, వ్యక్తిత్వ వికాసంలో, ఆరోగ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. బాడీష సతీష్ గ్రామ అభివృద్ధికి క్రీడా పోటీలను ఉపయోగిస్తూ యువతలో ప్రేరణ కలిగించారని ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. క్రీడా పరంగా విజయవంతమైన ఈ కార్యక్రమాన్ని బాడీష సతీష్ ఆధ్వర్యంలో గ్రామస్థులు, ప్రేక్షకులు ప్రశంసించారు. ఈ కార్యక్రమం లో బెస్ట్ సిక్స్ బహుమతి ఆర్ ఎంపి దేవదాస్, స్టేజ్ మీద సిక్స్ బహుమతి గడ్డం ప్రశాంత్, పోతాబోయిన పిచ్చయ్య, మామిలపల్లి శ్రీను, మిత్ర పక్ష కాంగ్రెస్ నాయకులు సాదిని సీతయ్య, కట్ట నరసింహారావు, తమ్మిశెట్టి సాంబా, నాగరాజ్, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఎస్‌ఎఫ్ఐ మహాసభలను జయప్రద్రం చేయండి

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఫిబ్రవరి ఐదు, ఆరు తేదీలలో పాల్వంచలో జరగబోయే ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రద్రం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సందీప్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్నటువంటి స్కాలర్షిప్‌లను ఫీజు రీయింబర్స్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు.

## ఫైనల్‌కి చేరిన 17వ యూసుఫ్ కప్ 2025

-ఆదివారం ఫైనల్‌లో తలపడనున్న సారపాక, కొత్తగూడెం జట్లు




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ కప్ ఫైనల్‌కు చేరింది. శుక్రవారం జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్ విశేషాలు టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షులు సోహెల్ పాషా తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం జరిగిన మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో మని ఎలెవన్(సారపాక) మరియు గుంటుపల్లి ఎలెవన్(సారపాక) జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన మని ఎలెవన్(సారపాక) జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 66 పరుగులకి ఆలౌట్ అయింది. 67 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన గుంటుపల్లి ఎలెవన్ సారపాక జట్టు 8.1 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసి ఫైనల్‌లో ప్రవేశించింది. బ్యాటింగ్‌లో 10 బంతుల్లో 24 పరుగులు చేసిన సాగర్(గుంటుపల్లి ఎలెవన్, సారపాక)కి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌ని నిర్వాహకులు అందజేశారు. మధ్యాహ్నం జరిగిన రెండో సెమీ ఫైనల్ మ్యాచ్‌లో ఫరీద్ ఎలెవన్(కొత్తగూడెం) మరియు చేజింగ్ ఎలెవన్(పాల్వంచ) జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ ప్రారంభించిన ఫరీద్ ఎలెవన్ కొత్తగూడెం జట్టు నిర్ణీత 12 ఓవర్లలకు గాను 11.3 ఓవర్లలో 88 పరుగులకి ఆల్‌ఔట్ అయింది. 89 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన చేజింగ్ ఎలెవన్ పాల్వంచ జట్టు 11.5 ఓవర్లలో 83 పరుగులకి ఆల్‌ఔట్ అయి ఓటమి చవి చూసింది. 5 పరుగుల తేడాతో విజయం సాధించిన కొత్తగూడెం జట్టు ఫైనల్‌లో ప్రవేశించింది. బ్యాటింగ్‌లో 54 పరుగులు చేసిన కొత్తగూడెం జట్టు ఆటగాడు పండు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ఆర్గనైజర్స్. ఆదివారం గుంటుపల్లి ఎలెవన్ సారపాక, ఫరీద్ ఎలెవన్ కొత్తగూడెం జట్ల మధ్య మెగా ఫైనల్ జరగనున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సలహదారులు సోహెల్ పాషా తెలిపారు.

## అర్హులను గుర్తించడమే సర్వే లక్ష్యం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్నటువంటి సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందటానికి ఇంటింటి సర్వే పారదర్శకంగా ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ అభయ భస్తం వంటి పథకాలు అమలులో భాగంగా శుక్రవారం సోంపల్లి, లక్ష్మీ పురం గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేశారు. గతంలో సంక్షేమ పథకాల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పథకాలకు అర్హులను గుర్తించటానికి ఇంటింటి సర్వే నిర్వహించి నిజమైనా లబ్దిదారులను ఎంపిక చేసేందుకు ప్రతిష్టాత్మకంగా సర్వేను నిర్వహిస్తున్నామని తెలిపారు. త్వరలో అమలయ్యే నాలుగు పథకాల అమలు విషయంలో ఈ సర్వే ఆధారంగా లబ్దిదారులకు అందుతాయన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని లిస్టులలో పేర్లు రాని వారి వివరాలను కూడా సేకరించి ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. సర్వే విషయంలో ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని, సర్వే చేస్తున్నటువంటి వారు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వాలన్నారు. ఈకార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ యండి ముజాహిద్, మండల అభివృద్ధి అధికారి జములారెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్, ఆర్ఐ నర్సింహారావు, ఏఈవో నాగవైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

## భట్టిపై విమర్శలు చేస్తే సహించేది లేదు



**ప్రజాపక్షం/ మధిర :** మధిర నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కపై విమర్శలు చేస్తే సహించేది లేదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనుమతి లేకుండా ఆత్కూర్ సర్కిల్‌కి అబ్బూరి పేరు పెట్టారని, కోర్టు ఉత్తర్వులు ద్వారానే అధికారులు పేరును తొలగించారని తెలిపారు. ఆత్కూరు గ్రామంలో రింగ్, రోడ్లు వేయించింది భట్టినేనని, గతంలో భట్టి పాదయాత్ర చేస్తున్న సమయంలో వాల్‌రైటింగ్ రాస్తే రెండు గంటల్లో చెరిపేసిన చరిత్ర టిఆర్ఎస్‌దని విమర్శించారు. సంబంధంలేని విషయంలో భట్టి దిష్టబొమ్మను దగ్ధం చేయటం దుర్మార్గమైన చర్యఅని అన్నారు. అబ్బూరి కుటుంబం ఆత్కూరు గ్రామానికి చేసింది ఏమిలేదని, మధిర నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్న భట్టిపై ఉన్న అక్కుస్సు, దురుద్దేశ్యంతోనే రాజకీయాల కోసం బిజెపి, టిఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఇఈ సమావేశంలో మండల ఎస్సీసెల్ అధ్యక్షులు దారా బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చావా వేణు, నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, కర్నాటి రామారావు, నిడమనూరి వంశీ పాల్గొన్నారు.

# క్రీడాకారులు తమ ప్రతిభతో జాతీయ స్థాయికి ఎదగాలి

**- నియోజకవర్గంలో క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించేందుకు ఎమ్మెల్యే కూనంనేని ప్రత్యేక కృషి**



**ప్రజాపక్షం/పాల్వంచ :** గెలుపు, ఓటమిని క్రీడాకారులు సమానంగా తీసుకొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా క్రీడాకారులకు సూచించారు. పాల్వంచ మండల పరిధి కిన్నెరసాని కొమరం భీమ్ యూత్ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ నాలుగు రోజుల పాటు నిర్వహించారు. పోటీల్లో మండలం నుండి 20టీములు పాల్గొనగా హోరాహోరి జరిగిన మ్యాచ్‌లో కిన్నెరసాని, జగన్నాధపురం టీం గెలుపొందింది. ముఖ్యఅతిధిగా పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా మొదటి బహుమతి జగన్నాధపురం, రెండవ బహుమతి కిన్నెరసాని జట్లకు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో సాబీర్‌పాషా మాట్లాడుతూ..కొమరం భీమ్ యువతను అభినందించారు. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలు అందుతాయని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని అన్నారు. భద్రాద్రి జిల్లాలో క్రీడాకారులకు కొదవలేదని, వారికి కావాల్సిన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించేందుకు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషి చేస్తున్నారని అన్నారు. జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ ప్రతిభ కనబర్చి జిల్లాకు వెన్నెతేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, సీపీఐ పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబ, సీపీఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, సీపీఐ మండల నాయకులు నిమ్మల రాంబాబు, కొంగర అప్పారావు, ఎస్‌కె ఖాసీం, విజయ్‌కుమార్, కొమరం భీమ్ యువత వజ్జా రామకృష్ణ, వజ్జా విక్రాంత్, తాటి సురేష్, ఆరీఫ్, ఉదయ్, రాంబాబు, అప్పారావు, లక్షణరావు తదితర క్రీడాకారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**ప్రజాపక్షం/సుజాతనగర్:** రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, ప్రతి వాహదారుడు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని సుజాతనగర్ ఎస్సై మాలోత్ రమాదేవి సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా పోలీస్ సిబ్బందితో కలిసి స్కూల్ పిల్లలతో వినూత్నంగా సుజాతనగర్ సెంటర్‌లో వాహనదారులకు, యువకులకు, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు నిబంధనల గురించి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పి. వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, కానిస్టేబుల్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# మహా అన్న ప్రసాద వితరణ



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలంలోని చీమలపాడు, బాజుమల్లాయిగూడెం కోదండరామాలయంలో అఖండ హరే రామ నామ సప్తాహం సందర్భంగా ఏడవ రోజు గురువారం సాయంత్రం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి సుమారు 2500 మంది భక్తులు పాల్గొని, అన్నప్రసాదములను స్వీకరించారు. అఖండ సప్తాహం ముగింపు సందర్భంగా ఏడు రోజులు 24 గంటలు నిర్విఘ్నంగా హరే రామ హరే రామ రామ రామ హరే హరే, హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే అనే రామ నామ భజన కార్యక్రమంలో పాల్గొన్న భజన బృందము సభ్యులందరికీ గ్రామ మాజీ సర్పంచ్ మాలోత్ కిషోర్, మాజీ ఎంపిపి శకుంతల శాలువాతో భజన బృందం వారిని ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు, చిన్నారులు, మహిళా భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శక్తివంతమైన ఉద్యమాలకు రైతులు సిద్ధం కావాలి

**రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** కార్పోరేట్ శక్తులనుంచి వ్యవసాయరంగాన్ని కాపాడేందుకు శక్తివంతమైన ఉద్యమాలకు రైతులు సమాయత్తం కావాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అన్నారు. శుక్రవారం బోడియాతండాలో రాందాస్ అధ్యక్షతన జరిగిన రైతుసంఘం గ్రామశాఖ మహాసలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 75 శాతం వ్యవసాయరంగానికి 50 శాతం నిధులు కేటాయించడంలో పక్షపాతం చూపించడం వల్ల వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో ఉన్నదని అన్నారు. ప్రభుత్వాలు వ్యవసాయరంగాన్ని కాపాడకపోతే దేశంలో ఆహార ఉత్పత్తులు తగ్గే ప్రమాదం ఉందని అన్నారు. అధికారాలు ఆర్భాటాలు తప్ప రైతులకు పాలకులు ఒరగబెట్టిందేమీలేదని అన్నారు. రైతుసమస్యలకోసం నిరంతరం పోరాడే తెలంగాణ రాష్ట్ర రైతుసంఘాన్ని గ్రామాగ్రామాన బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. తనికెళ్ల రెవిన్యూపరిదిలో ఉన్న బోడియాతండా గ్రామానికిచెందిన ఈదుల చెరువును బోడియాతండా గ్రామపంచాయతీ పరిదిలోకి తీసుకురావాలని అన్నారు. హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ పాఠశాలలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈమహాసభలో వడిత్యా వీరన్న, ధరావత్ రవి, బాణోత్ వెంకన్న, జర్పుల భీమ్లా, హనుమా, తేజావత్ రవి, థావు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బోడియాతండా రైతుసంఘం అధ్యక్షుడిగా ధరావత్ రవిని, ప్రధాన కార్యదర్శిగా వడిత్యా వీరన్నను వీరితోపాటు తొమ్మిదిమందిని కమిటీ సబ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఎంపిక పారదర్శకంగా రాజకీయాలకు అతీతంగా జరగాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో జరిగిన మండల కార్యదర్శి వర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా పేదలకు సంక్షేమ ఫలాలు అందించాలని డిమాండ్ చేశారు. లబ్దిదారుల ఎంపికలో జాబ్ కార్డులు, రేషన్ కార్డులు ఇతర ఇతర ప్రూఫ్స్ ద్వారా ఎంపిక సరైనది కాదని అన్నారు. మండలంలోని ఉన్న ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో గౌరీ నాగేశ్వరరావు, మాలోతు రావుజా, ఊకంటి రవికుమార్, నిమ్మల మధు, తదితరులు పాల్గొన్నారు.

# మిర్చి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

**రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు**




**ప్రజాపక్షం/కొణిజర్ల :** వ్యవసాయోత్పత్తులక చట్టబద్ధమైన గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్‌చేస్తూ గత 52 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతునేత జగజ్జిత్ సింగ్ దల్లేవాల్ కు మద్దతుగా తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో చిన్న మునగాల గ్రామంలో క్యాండిల్స్‌తో ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా చింతనిప్పు నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతురాంబాబు మాట్లాడుతు నరేంద్రమోడి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం రోజురోజుకు రైతులను మరింత సంక్షోభంలోకి నెట్టుతుందని అన్నారు. జగ్జత్‌సింగ్ దల్లేవాల్ కు మద్దతుగా పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో ఖనేరీలో 111 మంది రైతులు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారని అని అన్నారు. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్పోరేట్ అనుకూల వైఖరివల్ల వ్యవసాయ ఉత్పత్తుల ధరలు రోజురోజుకు తగ్గడం జరుగుతుందని అన్నారు. నాలుగు సంవత్సరాల క్రితం 2020 21లో వ్యవసాయ సీజన్‌లో బహిరంగ మార్కెట్‌లో పత్తి క్వింటాకు 12 వేల రూపాయల ధర ఉంటే గడిచిన మూడు సీజన్‌లలో 7 వేల రూపాయలకు మించి రావడంలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ నాఫెడ్ మిర్చికోనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమం తప్ప వేరే మార్గం లేదని అన్నారు. ఈకార్యక్రమంలో రైతులు చెరుకుమల్లి మోహన్‌రావు, చెరుకుమల్లి పురుషోత్తం, కంపాసాటి కృష్ణ, పులి నరసింహారావు, కొప్పుల మధు, తాతా నగేష్, తాతా శేషయ్య, ఇల్లందుల శేషయ్య, రవి, శ్రీనివాసరావు, దానేష్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రజా భవన్ నందు మణుగూరు, కరకగూడెం మండలానికి చెందిన సీఎం ఆర్ఎఫ్ లబ్ధిదారులకు రూ. 3,75,000 లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, రాష్ట్రంలోని పేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, మీ కుటుంబంలో అనారోగ్య పాలై మెరుగైన వైద్యం చేయించుకుని, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తుందని, ఈ డబ్బులు జాగ్రత్తగా మీ కుటుంబఅవసరాలకు వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, మణుగూరు మండల మహిళ అధ్యక్షులు సౌజన్య, అశ్వాపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, పినపాక మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సోలార్ సదుపాయంతో సాగు చేయడం అభినందనీయం

**- ఐటిడిఏ పిఓ రాహుల్**

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఏజె న్సీ గిరిజన గ్రామాల్లో రోడ్డు సౌకర్యం లేని భూముల్లో వ్యవసాయం చేసేందుకు సోలార్ విద్యుత్ ను వినియోగించి పంటలు పండించుకోవడం అభినందనీయమని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని లక్ష్మీ దేవి పల్లి మండలం బజ్జలగూడెం, లక్ష్మీ పురం, బంగారుచెలక గ్రామాల్లోని రైతులు విద్యుత్ సదుపాయం లేక సోలార్ తో పంటలు పండించుకుంటున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సదుపాయం లేక చాలా పొలాలు బీళ్లుగానే మారిపోతున్నాయని, కానీ ఇక్కడి రైతులు సోలార్ విద్యుత్‌తో పంటలు పండించుకోవడం గర్వకారణం అన్నారు. 2017 18 సం.లో రెడ్‌కో సంస్థ సోలార్ విద్యుత్ సదుపాయం కల్పిస్తామని ముందుకు రావడంతో రైతులు బోర్లు వేయించుకుని సోలార్ ద్వారా నీటి వసతి పొంది ఏటా రెండు పంటలు పండించుకుంటున్నారని తెలిపారు. సోలార్‌తో పాటు విద్యుత్ సదుపాయాన్ని కల్పిస్తే మరిన్ని ఎక్కువ భూములు సాగులోనికి వచ్చి జీవన స్థితిగతులు మారేందుకు సహకరించాలని



రైతులు పిఓను కోరారు. దీంతో స్పందించిన పిఓ అందుకు కావాల్సిన చర్యలు చేపడతామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజు, మైనింగ్ ఏడి రమేష్, రెడ్కో జిఎం అజయ్ కుమార్, విద్యుత్ ఏఇ రఘురామయ్య, ఉద్యానాధికారి ఉదయ్, పవర్ ఏపిఓ మునీర్ పాషా, ఫారెస్టు జాయింట్ కమిటీ సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# సర్వే పారదర్శకంగా ఉండాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఇందిరమ్మఇల్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల లబిధారుల ఎంపికై జరుగుతున్న సర్వే పారదర్శకంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ రావు అన్నారు. శుక్రవారం జిల్లాలో జరుగుతున్న సర్వేను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూర్గంపాడు మండలంలోని సోంపల్లి, లక్ష్మీ పురం, కోయగూడెం గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయ తలపెట్టిన నాలుగు పథకాలు అర్హులైన వారికే అందాలని, అందుకు అధికారుల పనితీరే గీటురాయన్నారు. అధికారుల పనితీరు ప్రభుత్వ ప్రతిష్టను పెంచేదిలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన

**ప్రజాపక్షం / పాల్వంచ :** రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. శుక్రవారం మండల పరిధి నాగారం కాలనీ చెక్ పోస్ట్ వద్ద రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమంలో భాగంగా వాహనదారులకు గులాబీలను పంపిణీ చేసి రోడ్డు భద్రత, ట్రాఫిక్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ ఎండీ ఫరూక్, కానిస్టేబుల్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/పాల్వంచ :** తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తామని, వారిని ఆదుకుంటామని సీపీఐ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా అన్నారు. శుక్రవారం పాల్వంచ జై తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం కార్యాయలంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ఎమ్మెల్యే కూనంనేని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అర్హులైన ఉద్యమకారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సాబీర్ పాషాను ఉద్యమకారులు సన్మాంచారు. ఈ కార్యక్రమంలో జై తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సయ్యద్ రషీద్, సంఘం సభ్యులు ఉబ్బన శీను, ఆరవెల్లి పెద్దబాబు, ఎస్‌కె గౌస్, జయరాజు, మహమ్మద్ సద్దా, రాము, ఆసిఫ్, పాషా, నయీం, పఠాన్, సత్తార్, సందీప్, నివాస్, ఇబ్రహీం, ఇమ్రాన్, సోహెల్, అక్రమ్, అజ్మల్, అంజద్, చాంద్‌పాషాపాల్గొన్నారు.

# ఎస్‌ఎఫ్‌ఎస్ విద్యార్థులకు కలెక్టర్ అభినందన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జాతీయస్థాయికి ఎంపికైన ఎస్‌ఎఫ్‌ఎస్ విద్యార్థులను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అభినందించారు. ఈనెల ఏడు నుంచి తొమ్మిది వరకు మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల ఎస్‌వికెఎం పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలలో ఖమ్మం నగరంలోని ఎస్‌ఎఫ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు టి. సత్యసాయి, సిహెచ్ యశ్వంత్ లు ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్ సబ్ థీమ్ విభాగంలో స్మార్ట్ కార్ అండ్ స్మార్ట్ కమ్యూనికేషన్ టైటిల్‌తో ప్రదర్శించిన ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు టి. సత్యసాయి, సిహెచ్ యశ్వంత్ లతో పాటు ప్రాజెక్టు గైడ్ టీచర్ కె. రోశయ్యలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అభినందించారు. ఈనెల 21 నుంచి 25 వరకు పాండిచ్చేరిలో జరగనున్న సౌత్ ఇండియా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వారికి ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, డిఈవో సోమశేఖర శర్మ, పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ రాజారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఖమ్మం జిల్లా నుంచి అత్యుత్తమ ప్రాజెక్టులను జాతీయ స్థాయిలో అందించాలని ఆకాంక్షించారు. ప్లాస్టిక్‌ను నిర్మూలించడానికి భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులు తయారు చేయాలని సూచించారు.

# సర్వేను సకాలంలో పూర్తి చేయాలి

**-ఆన్లైన్ నమోదు ప్రక్రియ కూడ పూర్తి చేయాలి**
**-ఖమ్మం ఆర్డీవో నరసింహారావు**





**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** సంక్షేమ పథకాల పై చేపట్టిన సర్వే ను సకాలంలో పూర్తి చేయాలని ఖమ్మం ఆర్డీవో జీ.నరసింహారావు ఆదేశించారు. మండలం లోని గువ్వలగూడెం, మోటాపురం, రాజేశ్వరపురం గ్రామాలలో జరుగుతున్న సర్వే ను శుక్రవారం పరిశీలించారు. ఇంటింటా తిరిగి సర్వే తీరు ను పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో పొలాల వద్దకు వెళ్లారు. అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్ పొలాలను పరిశీలించారు. వీటిని ఎలా నమోదు చేస్తున్నారని సర్వే అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే అధికారులకు పలు సూచనలు సలహాలు అందించారు. పలుగ్రామాలలో రేషన్ కార్డులు అర్హత ఉన్న వారికి కూడ రాలేదని..పలుమార్లు ధరఖాస్తులు చేసుకున్నామని ఆర్డీవో వద్ద సమస్య ను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వే ను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే ను పకడ్బందీగా చేపడుతున్నట్లు తెలిపారు. సర్వే పూర్తి చేసిన అనంతరం వాటిని ఆన్లైన్ నమోదు ప్రక్రియ కూడ శర వేగంగా పూర్తి చేయాలని సూచించారు. అందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. సర్వే అనంతరం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వే ను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ జె. మాణిక్య రావు ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, వ్యవసాయాధికారి యం.రాధ, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ లు ఆలస్యం మధుసూధన్రావు, బీ.రవి, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** మండల కేంద్రంలో అభివృద్ధిలో భాగంగా సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించారు. మండల ప్రధాన కేంద్రంలో 700మీటర్ల వరకు సెంట్రల్ లైటింగ్ రోడ్డు డివైడర్ నిర్మాణంలో భాగంగా సుమారు 5కోట్ల రూపాయలతో గత బిఆర్ఎస్ ప్రభు త్వం ఉన్నప్పుడు మాజీ శాసన సభ్యులు మెచ్చా నాగేశ్వరరావు కృషితో అన్నపురెడ్డిపల్లి ప్రధాన కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ కొరకు నిధులను కేటాయించారు. ఎన్నికలు రావడం వలన పనులు ప్రారంభించలేకపోయారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో శాసన సభ్యులు జారే ఆదినారాయణ శంకుస్థాపన చేసి రోడ్డు పనులను ప్రారంభించారు. ఇదిలా ఉండగా గ్రామ ప్రజల్లో మాత్రం ఆందోళన మొదలైంది. సదరు కాంట్రాక్టర్ 50 అడుగుల విస్తీర్ణంతో మార్కింగ్ చేశారు. తర్వాత కొంత మంది వ్యాపారస్తులు గ్రామ ప్రజలు 5అడుగులు వద్దు 33 అడుగులు చాలు అని అధికారులకు ప్రజాప్రతినిధులకు విన్నవించుకోగా..ప్రస్తుతం 33 అడుగుల వద్ద సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించారు. ఏది ఏమైనప్పటికీ కూడా గ్రామంలో భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని మరి కొంత మంది గ్రామస్తులు అధికారుల వద్దకు ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి 33 అడుగులు వద్దు 50 అడుగులు రోడ్డు వేయాలంటూ దరఖాస్తులను సమర్పిస్తున్నారు. ఈ విధంగా ఉండటంతో అసలు రోడ్డు ఎంత వేస్తారు అనే సందిగ్ధతలో మండల ప్రధాన కేంద్రంలో ఉన్నటువంటి వ్యాపారస్తులు ప్రజలు గందరగోళంలో ఉండిపోయారు. ఏది ఏమైనాప్పటికీ భవిష్యత్ తరాలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా...నియోజకవర్గంలో అన్ని మండలాలకు ఏ విధంగా ఇచ్చారో అదే విధంగా అన్నపురెడ్డిపల్లి మండలంలో కూడా సెంట్రల్ లైటింగ్ పనులు చేయించాలని అధికారులు రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులు ప్రత్యేక ప్రణాళికను ఏర్పాటు చేసి రోడ్డు డ్రైనేజీ సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులను చేపట్టాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

## వాసవి భవన్ అధ్యక్షుడుగా సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నిక



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక వాసవి భవన్ అధ్యక్షుడు గా మాటూరి సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం వాసవి భవన్ అధ్యక్ష పదవి కి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికలలో మాటూరి సుబ్రహ్మణ్యం సింగిల్ నామినేషన్ వేయటంతో ఎన్నికల అధికారులు ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు ఎన్నికల అధికారులు గెల్లా జగన్మోహన్ రావు, వంగవీటి నాగేశ్వరరావు, రేగూరి హనుమంతరావు, కొత్త రమేష్, దోసపాటి చంద్రశేఖర్ లు ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం మాట్లాడారు... వాసవి భవన్ ఆధునీకీకరణ ను త్వరలోనే చేపడతామని పేర్కొన్నారు. తన పై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని అన్నారు. అధ్యక్షుడు ను డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, యర్రా నాగేశ్వరరావు. దేవరశెట్టి లక్ష్మణావు, వెంకటరమణ గుప్తా గెలా వాసు సుబ్బయ్య ఈగ అనిల్, దోసపాటి అచ్యుత్ రామయ్య, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామి దేవాలయం చైర్మన్‌గా రమేష్



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** స్థానిక శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం చైర్మన్ గా నేలకొండపల్లి కి చెందిన కనమర్లపూడి రమేష్ ను నియమించారు. అదే విధంగా పాలకవర్గ సభ్యులు గా మల్లయ్య, కోటేశ్వరీ, సత్యనారాయణ, రాంబాబు, పి.సత్యం లు శనివారం దేవాలయం లో ప్రమాణాస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమం కు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ. సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి తో పాటు, దేవాదాయ శాఖ అధికారులు హజరు కానున్నారు. కార్యక్రమం ను విజయవంతం చేసేందుకు అధిక సంఖ్యలో తరలిరావాలని చైర్మన్ రమేష్ కోరారు.

## అప్పుల బాధతో మామిడి మొక్కల వ్యాపారి ఆత్మహత్య

**ప్రజాపక్షం/కూసుమంచి :** మండలంలోని లోక్యాతండాకు చెందిన మామిడి మొక్కల వ్యాపారి వడిత్య నవీన్ కుమార్ (33) శుక్రవారం గడ్డి మందు తాగి ఆత్మహత్య కు పాల్పడ్డాడు. వివరాలకు వస్తే కూసుమంచి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లోక్య తండాకు చెందిన వడిత్య నవీన్ కుమార్ వ్యవసాయం చేసుకుంటూ మామిడి మొక్కల వ్యాపారం ఇంకా కౌలు వ్యవసాయం చేసుకుంటూ భార్యాభర్తలు జీవిస్తున్నారు. మొక్కలు నిర్వాహన కొరకు తన భర్త అప్పులు చేసి ఉన్నాడని అప్పుల వాళ్ళు నిరంతరం ఫోన్ కాల్స్ చేయడంతో గత పది రోజుల క్రితం బయటికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాకుండా శుక్రవారం కౌలుకు తీసుకున్న చేనులో శవమై కనిపించినట్లు మృతుని భార్య వర్త్య స్వాతి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మృతుడు నవీన్ కుమార్ కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆ పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయా గ్రా మాల్లో లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి సుమారు మూడు లక్షల సీఎంఆర్ చెక్కులను అందజేసినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోవిందరెడ్డి, జిల్లా మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, సీనియర్, నాయకులు భోజ్యానాయక్, నల్లమోతు రమణ, ఫజల్ బక్ష, సారేపల్లి శేఖర్, ఇమ్రాన్ అన్వర్ పాల్గొన్నారు.

## అతివేగం వద్దు.. నిదానమే ముద్దు



**ప్రజాపక్షం/కొణిజర్ల :** అతివేగం వద్దని నిదానమే ముద్దని నిదానమే రక్షణ కలిగిస్తుందని వైరా అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ ఎన్ రవి చందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొణిజర్లలో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఆటో డ్రయివర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు అతివేగంగా వాహనాలు నడపొద్దని అతివేగం ఎంతో ప్రమాదకరమని నిదానమే మనకు రక్షణ అని అన్నారు. ప్రతివాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ అశోక్ కుమార్, ఆటో డ్రయిర్లు పాల్గొన్నారు.

## క్రికెట్ ఆడుతూ గుండెపోటుతో యువకుడి మృతి

**ప్రజాపక్షం/కూసుమంచి :** మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత కొన్ని రోజుల నుండి నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఆటలో భాగంగా శుక్రవారం క్రికెట్ ఆట ఆడుతూ గుండెపోటుతో కుప్పకూలి నా అస్సాం విజయ్ (25) అనే యువకుడు అనంతరం అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించిన తోటి స్నేహితులు వెంటనే అతనిని ఖమ్మం తరలిస్తున్న మార్గం మధ్యలో మృతి చెందాడు. విజయ్ మృతితో మండల కేంద్రంలో విషాదఛాయలనుకున్నాయి. తమతోపాటు ఆట ఆడుతూ ఒకసారిగా కుప్పకూలి మృతి చెందిన యువకుడు తమ వెంట లేడని స్నేహితులు విలపించిన తీరు పలువురు నీ కంటనీరు పెట్టించింది.

## కార్మికులకు అండగా ఐఎన్‌టియుసి

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ సమస్యల పరిష్కరమే దిశగా ఐఎన్టీయూసీ యూనియన్ ముందుంటుందని సత్తుపల్లి, కిష్టారం ఓసి ఫిట్ సెక్రటరీ గాజే బాలాజీ అన్నారు. శుక్రవారం కిష్టారం ఓసి ఉద్యోగులకు ఐఎన్టీయూసీ నూతన సంవత్సర క్యాలెండర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పమ్మి శ్రీనివాస్, అఫ్రోజ్, గుత్తుల నవీన్, గుడిపల్లి శ్రీనివాస్, కెడం కోటేశ్వర్, దేగల రాజు, ధనాల రాము, జితేందర్ రెడ్డి, వామనమూర్తి, చంద్రశేఖర్, బొలెద్దుల కుమారస్వామి, బొక్క శ్రీనివాస్, జొన్నలగడ్డ జాన్సన్, పిచ్చయ్య, బాలు, మంగరాజు, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

# విద్యకు ఆర్థిక చేయూత విద్యాదానం కంటే గొప్పది

**-విద్యాభివృద్ధే లక్ష్యంగా సీతారత్నం ట్రస్టు సేవలు**
**-కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె. విజయ్‌భాస్కర్ రెడ్డి**



**ప్రజాపక్షం/ఖమ్మం :** పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్యార్జనకు ఆర్థిక చేయూతనందించడం విద్యాదానం కంటే గొప్ప విషయమని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కడారు విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతిభ కలిగిన అనేక మంది తమ లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారని అటువంటి వారికి పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు చేయూతగా నిలవడం అభినందనీయమని, పలువురికి ఆదర్శమని ఆయన అన్నారు. పరిశ సీతారత్నం ట్రస్టు ద్వారా ఖమ్మం నగరంలోని పాండురంగాపురం ప్రాంతానికి చెందిన ఈడబోయిన వెంకన్న, అంజమ్మల కుమార్తెకు రూ. 20వేల ఆర్థిక సాయాన్ని విజయ్ భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఈడబోయిన ఇందు బిఫార్మసి అభ్యసిస్తున్నది. ఈ విషయం తెలుసుకున్న పరిశ సీతారత్నం ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు పరిశ పుల్లయ్య ఆర్థిక సహాయాన్ని విజయ్‌భాస్కర్‌రెడ్డి ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యాభ్యాసం ఇప్పుడు ఖర్చుతో కూడుకున్నదని సాంకేతిక, వృత్తి విద్య మరింత ఇబ్బందికరంగా మారిందని ఇటువంటి సమయంలో ఆర్థిక చేయూతనిచ్చేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. గడిచిన నాలుగేళ్లుగా పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడం అభినందనీయమని, ట్రస్టు సేవలు మరింత విస్తృతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం పొందిన ఇందుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని, ఎక్కడ ఉన్న సేవాభావాన్ని కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మహంకాళి స్వరాజ్యలక్ష్మి, పరిశ లక్ష్మిరాజ్యం, బొగ్గారపు మధు, గొండాల మురళికృష్ణ, ప్రభుత్వ పెన్షనర్లు రామకృష్ణారావు,స్వర్గం పుల్లయ్య,విద్యార్థినితల్లి అంజమ్మ పాల్గొన్నారు.

# పాఠశాల నూతన భవనానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించాలనే లక్ష్యంతో కొనసాగుతున్న శ్రీకృష్ణ ప్రసాద్ పోలీసు సంక్షేమ ఉన్నత పాఠశాల అభివృద్ధికి విరట్యూసా పౌండేషన్ సభ్యులు ముందుకు వచ్చారు. అందులో భాగంగా సదరు పౌండేషన్ సభ్యులు కృష్ణ ఏదుల, శ్రీనివాస సుబ్బారావు, అవిజిత్‌శర్మ, అరుణ లతో కలిసి పాఠశాల చైర్‌పర్సన్ నిష్టాశర్మ శుక్రవారం నూతన పాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి పోలీసుకమిషనర్ సునిల్‌దత్ హాజరై పాఠశాల అభివృద్ధికి ముందుకు వచ్చిన పౌండేషన్ సభ్యులను అభినందించారు. ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థలకు చేరడంతో సామాజిక సేవలో భాగంగా పాఠశాల చైర్‌పర్సన్ నిష్టాశర్మ చొరవతో నూతనభవన నిర్మాణానికి ముందుకు వచ్చినట్లు పౌండేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, టిఫిన్ బాక్స్‌లు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మీరిజర్వ్‌డ్ ఏసిపి నర్సయ్య, సుశీల్ సింగ్, రిజర్వ్‌ఇన్‌స్పెక్టర్ కామరాజు, సురేష్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

# వ్యాయామ అధ్యాపకుడు పేరెల్లి కోటికి డాక్టరేట్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లా కేంద్రంలోని యూనివర్శిటి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యూకేషన్ కెయూ కళాశాలలో అధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్న సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం చెన్నకేశవపూర్‌కు చెందిన పేరెల్లి కోటికి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. వ్యాయామ విద్యావిభాగంలో హిస్టారికల్ డవలప్‌మెంటు ఆఫ్ కబడ్డి ఇన్ ఇండియా విత్ ఏ స్పెషల్ రిఫరెన్స్ టూ తెలంగాణ స్టేట్ స్టడి అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ కె.సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన పరిశోధనాత్మక గ్రంధానికి డాక్టరేట్ వచ్చినట్లు సదరు అధ్యాపకుడు కోటి శుక్రవారం మిడియాకు తెలిపారు. తన పరిశోధనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన అందరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, కుటుంబ సభ్యులు, మిత్రులు ఆయనకు అభినందరనలు తెలియజేశారు.

# రైతులు ఉద్యమాలకు సిద్ధం కావాలి

**- ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు**
**- గూడూరుపాడు ఏఐకేఎస్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక**






**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకై ప్రభుత్వాతలపై పోరాడేందుకు రైతులు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐకేఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరావు పిలుపునిచ్చారు. గురువారం రాత్రి ఖమ్మంరూరల్ మండలం గూడూరుపాడు గ్రామంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఏఐకేఎస్)శాఖ మహాసభనుబండి అంజయ్య అధ్యక్షతన నిర్వహించారు. తొలుత అక్కడ ఏర్పాటు చేసిన ఏఐకేఎస్ జెండాను సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ అవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో గోవిందరావు మాట్లాడుతూ...దేశవ్యాప్తంగా 75శాతం వ్యవసాయరంగం ఉన్నప్పటికీ బడ్జెట్లో 50శాతం నిధులు కేటాయించడం రైతులను విస్మరించడమే అన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే వ్యవసాయరంగం కుదేలవుతూ వస్తుందని ఆరోపించారు. కేవలం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుండటంతో ఆ భారం వ్యవసాయ రంగంపై పడి ఆహార ఉత్పత్తులు తగ్గే ప్రమాద పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం గూడూరుపాడు(ఏఐకేఎస్)నూతన గ్రామ శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎర్రబోయిన వెంకటనరసయ్య, ఉపాధ్యక్షులుగా పోడేటి భాస్కర్, బండి ఉపేందర్, కార్యదర్శిగా బండి రమణ, సహాయ కార్యదర్శులుగా వడ్డేపూడి వెంకటేశ్వర్లు, మారుతి నరేష్, ట్రెజరీగా పుచ్చకాయల రాంబాబు, సభ్యులుగా కర్ణం పెద్ద ఉపేందర్, బండి వెంకటయ్య, ఎర్రబోయిన వెంకటనారాయణ, కొలిచలం వీరయ్య, సావిడి గంగయ్య, బండి రాంబాబు, మారుతి వెంకన్న ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, ఏఐకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బానోత్ రాంకోటి, పాలేరు నియోజకవర్గం ఇంచార్జ్ ఎడ్లపల్లి శంకరయ్య, రైతుసంఘం మండల ప్రధాన కార్యదర్శి ఏలూరి భాస్కర్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# అనంతారం గ్రామంలో మెగా హెల్త్ క్యాంప్



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలం అనంతారం గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం ఖమ్మం లోని సాయిరాం కిడ్నీ ప్రైవేట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. హెల్త్ క్యాంపును మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్ జంగాల, చైర్మన్ స్వాతి జంగాల జూలూరుపాడు సిఐ ఇంద్రసేనా రెడ్డి ప్రారంభించారు. ఈ మెగా హెల్త్ క్యాంపులో సాయిరాం కిడ్నీ హాస్పిటల్ డాక్టర్లు విజయేష్ వర్మ, కిషోర్ రెడ్డిలు పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులకు రక్త పరీక్షలు, ఇతర పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. రోగులకు జంగాల రాజేశ్వరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ తీసుకోవాలి



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ తీసుకొని ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులు నియమించాలని పాలేరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రమేష్ అన్నారు. మండల పరిధిలోని జూపెడ, పాతర్లపాడు చంద్రు తండా బచ్చోడు గ్రామాల్లో ప్రభుత్వ భూముల ను గుర్తించేందుకు శుక్రవారం గ్రామాల్లో పర్యటించారు. తహసిల్దార్ పి.వి రామకృష్ణ, ఆర్ఐ సర్వేలతో కలిసి పలు గ్రామాలను సందర్శించి ప్రభుత్వ భూములు గుర్తించి వాటి పరిరక్షణకు ప్రత్యేక కార్యచరణ తీసుకోవాలని ఆయన సూచించారు. మండల పరిధిలోని ఉన్న 40 గ్రామాల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములు ఆ క్రమంలో ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించి ప్రభుత్వం తరపున హద్దులు నియమించాలని ఆయన సూచించారు. ఆయన వెంట తహసిల్దార్ పి.వి.రామకృష్ణ, ఆర్ఐ వీరయ్య సర్వేర్లు తదితరులు పాల్గొన్నారు.

# టిఎన్‌జీవోస్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**-అధ్యక్ష, కార్యదర్శులుగా**
**గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్**





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** టిఎన్‌జీవోస్ యూనియన్ ఖమ్మంజిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఖమ్మంజిల్లా టిఎన్‌జీవోస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ ఖమ్మంజిల్లా కమిటీ ఉపాధ్యక్షులు సతీష్ వ్యవహరించారు. పర్యవేక్షకులుగా టిఎన్‌జీవోస్ కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, ఖమ్మంజిల్లా టిఎన్‌జీవో అడహక్ కమిటీ కన్వీనర్ ముత్యాల సత్యనారాయణ గౌడ్ వ్యవహరించారు. సింగిల్ సెట్ నామినేషన్ రావడంతో టిఎన్‌జీవోస్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులుగా కొమరగిరి దుర్గాప్రసాద్, కోశాధికారిగా వల్లపు వెంకన్న, ఉపాధ్యక్షులుగా ఎర్ర రమేష్, బానోత్ శ్రీధర్ సింగ్, సగ్గుర్తి ప్రకాషరావు, బాదవత్ కరణ్‌సింగ్, ఎస్. లలితకుమారి, సహాయ కార్యదర్శులుగా తాళ్లూరి శ్రీకాంత్, భూసా చంద్రశేఖర్, యాకూబ్‌పాషా, ఏలూరి హరికృష్ణ, శీలం రాధాకారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పెద్దినేని రాధాకృష్ణ, పబ్లిసిటీ సెక్రటరీగా ఎర్రమళ్ల శ్రీనివాసరావు, ఆఫీస్ సెక్రటరీగా టి. రవీంద్రబాబు, స్పోర్ట్స్ సెక్రటరీగా సాయికృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎండి అస్లాం, ఎన్. విజయ్, డి. నాగరాజు, ఈ. రవిచంద్ర, ఎస్‌కె రహీంఖాన్, వాసాల శ్రీను, డి. నాగలక్ష్మి లు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీని పలువురు నాయకులు , ఉద్యోగులు అభినందించారు. ఈ ఎన్నికకు టిఎన్‌జీవోస్ నాయకులు పి. రామయ్య, జి. బాలకృష్ణ, జైపాల్, విజయ్‌కుమార్ సమన్వయ కర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జీవోస్ యూనియన్ నాయకులు, అనుబంధ శాఖల బాధ్యులు, వివిధ యూనిట్ల బాధ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి టిజీవో రాష్ట్ర అధ్యక్షులు, టిజెఏసి రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, టిజీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రితో పాటు వివిధ సంఘాల బాధ్యులు అభినందనలు తెలిపారు.

# రోడ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయండి



**ప్రజాపక్షం/ఖమ్మం :** మల్లెమడుగు డబుల్‌బెడ్‌రూం గృహ సముదాయానికి రోడ్లు మంజూరయ్యాయని వాటి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు మల్లెమడుగు డబుల్‌బెడ్‌రూం నివాసుల సంఘం అధ్యక్షులు బోడ వీరన్న కోరారు. మల్లెమడుగు డబుల్‌బెడ్‌రూం ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ కొరకు రూ.2.50 కోట్లు మంజూరు చేసినందుకు మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. శాలువతో సత్కరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపి పనులు త్వరలో పూర్తి చేసేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనిల్, యాకూబ్, రవి, కృష్ణ, తస్లిమా, సీతయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.